సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 4 । అక్టోబర్ । 2022

లోయలోకి దూసుకెళ్లిన పర్యాటకుల కారు



పాడేరు రూరల్: మండలంలోని వంజంగి హిల్స్‌పైగల లోయలోకి పర్యాటకుల కారు ప్రమాదవశాత్తూ దూసుకుపోయింది. ఒడిశాకు చెందిన పర్యాటకులు సోమవారం వంజంగి అందాలను తిలకించేందుకు కారులో వచ్చారు. తిరుగు ప్రయాణంలో కొండ దిగుతుండగా వంజంగి కొండపై వై మలుపు వద్ద ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి సమీపంలో ఉన్న లోయలోకి దూసుకుపోయింది. లోయలో తుప్పలు అధికంగా ఉండడంతో కొద్ది దూరంలో ఆగిపోయింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. కారులో ఉన్న పర్యాటకులు ఎటువంటి గాయాలు కాలేదు. ప్రమాదం తప్పడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు



రాజవొమ్మంగిలో నివసిస్తున్న ఉమామహేశ్వరి అనే గృహిణి ఇంటి పెరటిలో సోమవారం బ్రహ్మ కమలాలు వికసించి కనువిందు చేశాయి. కొమ్మ కొమ్మకు పూసిన ఈ పూల అందాలకు, వాటి సువాసనలకు స్థానికులు ఫిదా అవుతున్నారు.

- రాజవొమ్మంగి

న్యూస్‌రీల్

ఏజెన్సీలో భారీ వర్షం



అరకులోయలో కురుస్తున్న వర్షం

అరకులోయ రూరల్/కొయ్యూరు: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొయ్యూరు మండలంలో మధ్యాహ్నం ప్రారంభమైన వర్షం రాత్రి వరకు కురుస్తూనే ఉంది. రోడ్లు, పొలాలు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కాకరపాడు–కొయ్యూరు రోడ్డు పూర్తిగా పాడైంది. తీగలమెట్ట, బూదరాళ్ల,కొయ్యూరు, పలకజీడి, గొట్టుపాడుల్లో కాలువలు ఉధృతంగా ప్రవహించాయి.



ఉధృతంగా ప్రవహిస్తున్న తీగలమెట్ట కాలువ

సెలవుల్లో కళాశాలలు తెరిస్తే ఉపేక్షించేది లేదు

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

పాడేరు రూరల్: దసరా సెలవుల్లో కళాశాలలు తెరిస్తే ఉపేక్షించేది లేదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈనెల 2 నుంచి 9వ తేదీ వరకు జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలలకు దసరా సెలవులు ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఆర్ఐవోలకు ఈ సెలవుల అమలుపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

ఏ ఒక్క కళాశాలకు కూడా ప్రత్యేక మినహాయింపు లేదన్నారు. దసరా సెలవుల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు తమ దృష్టికి వస్తే కళాశాల అనుమతుల రద్దుకు సిఫారసు చేస్తామని తెలిపారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగానికి తగిన ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదులను నేరుగా మెయిల్ పంపిస్తే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

తణుకు వెంకటరామయ్యకు సప్పా అవార్డు

అడ్డతీగల: స్థానిక పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్యను సప్పా అవార్డుకు ఎంపిక చేశారు. ఆధ్యాత్మిక రంగంలో తణుకు వెంకటరామయ్య అందిస్తున్న సేవలకు గుర్తింపుగా సప్పా ఎక్స్‌లెన్స్–2022 జాతీయ పురస్కారం,ఆధ్యాత్మిక సేవా శౌరి బిరుదును ప్రదానం చేయనున్నట్టు రాజమహేంద్రవరానికి చెందిన నటరాజ నృత్యనికేతన్ సంస్థ సోమవారం ప్రకటించింది. ఈనెల 13న రాజమహేంద్రవరంలో ఈ అవార్డు అందజేయనున్నారని, ఈ మేరకు తనకు ఆహ్వానం వచ్చిందని వెంకటరామయ్య తెలిపారు.

శరణు శరణు.. శైలపుత్రి



రాజవొమ్మంగి: దుర్గతులను నివారించే మహాశక్తి స్వరూపిణి దుర్గాదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, శరణుజొచ్చారు. అడ్డతీగల,గంగవరం, చింతపల్లి,డుంబ్రిగుడ,జి.మాడుగల, పాడేరు తదితర మండలాల్లో ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి హారతులిచ్చి, అర్చనలు చేశారు. రాజవొమ్మంగి మండలంలో జడ్డంగి, దూసరపాము, అమీనాబాద్, కొండపల్లి, శరభవరం, చెరకుంపాలెం, వైకుంఠపురం, అమీనాబాద్‌కాలనీ, లాగరాయి, వట్టిగెడ్డ, రాజవొమ్మంగి శివాలయం కొండపై భక్తులు వేకువజామునుంచే బారులు తీరి, అమ్మను దర్శించుకుని తమ భాగ్యానికి పొంగిపోయారు.

నేడు బోనాల పండగ

మండలంలోని అమీనాబాద్‌కాలనీలో వెలసిన దుర్గమ్మ అమ్మవారి గుడిలో మంగళవారం బోనాల పండగ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీ ఇంటి నుంచి బోనాలను ఊరేగింపుగా తీసుకొని వచ్చి అమ్మవారికి అభిషేకాలు చేస్తారన్నారు.

దర్శనమీయరా.. కొండలరాయ

అనంతగిరి: మండలంలోని గుమ్మపంచాయతీలో పలు గ్రామాలకు చెందిన గిరిజనులను రెండు బస్సుల్లో తిరుమలలో దైవ దర్శనానికి బయలుదేరారు.తిరుమల శ్రీవారి దర్శించుకునే భాగ్యం ఇన్నాళ్లకు కలుగుతోందని పలువురు ఉబ్బితబ్బిబ్బు అవుతూ పయనమయ్యారు. టీటీడీ సహకారంతో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలోని 94 మంది గిరిజనులను దసరా మహోత్సవం సందర్భంగా సోమవారం తిరుమలకు ఉచితంగా తీసుకువెళ్లినట్టు ఎస్ఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ జయలక్ష్మి తెలిపారు.

50 మంది రామభక్తులు..

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల వనుగుమ్మ పంచాయతీ పనస గ్రామంలో శ్రీరామ మాల ధరించిన 50 మంది రామ భక్తులు తిరుమలలో వేంకటేశ్వర స్వామిని దర్శించేందుకు సోమవారం తెల్లవారుజామున ప్రత్యేక బస్సుల్లో బయలుదేరారు. ఎన్నడూ లేని విధంగా అత్యంత మారుమూల పనస గ్రామ గిరిజనులు శ్రీరామ మాల ధరించి, పుణ్యక్షేత్రాలు సందర్శించాలనే సంకల్పంతో ప్రయాణమయ్యారు.



తిరుపతికి బయలుదేరుతున్న పనస గ్రామ గిరిజనులు



రెండు బస్సుల్లో దైవదర్శనానికి బయలుదేరిన గిరిజనులు

ఆశాజనకంగా రాజ్‌మా సాగు

- 70 శాతం భూముల్లో ముందస్తుగానే మొక్కదశ
- కొండపోడులో పంటవేసేందుకు చురుకుగా భూమి చదును పనులు
- 90శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ

సాక్షి,పాడేరు : ఏజెన్సీలో ప్రధాన వాణిజ్య పంటగా గుర్తింపు పొందిన రాజ్‌మా(ఎరుపు రకం) సాగు ఆశాజనకంగా ఉంది. ఇప్పటికే 70 శాతం మెట్ట భూముల్లో పంట మొక్కదశకు చేరుకుంది. కొండపోడు భూముల్లో సాగుకు రైతులు భూమి చదును పనులు చేపట్టారు. సేంద్రియ పద్ధతిలో మెట్ట, కొండపోడు భూముల్లో గిరిజన రైతులు సాగు చేసే రాజ్‌మాకు జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉంది. పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో 9,500 హెక్టార్ల విస్తీర్ణంలో రాజ్‌మా సాగు చేస్తారు. ఏపీ సీడ్స్ ద్వారా సేకరించిన 4,600 క్వింటాళ్ల ఎరుపు రకం రాజ్‌మా విత్తనాలను 90శాతం సబ్సిడీపై సుమారు 10 వేల మంది గిరిజన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసింది. గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా పండించేందుకు పోలీసుశాఖ సహకారంతో మారుమూల గ్రామాల రైతులకు ఈ విత్తనాలను అందజేశారు.



మొక్క దశలో రాజ్‌మా పంట

మొక్క దశలో కళకళ : మెట్ట భూముల్లో ముందస్తుగానే విత్తనాలు జల్లడంతో అవి మొలకెత్తి మొక్క దశలో కళకళలాడుతున్నాయి. కొండపోడులోను రాజ్‌మా విత్తనాలను వేశారు. నవంబర్ నెలాఖరు, డిసెంబర్ మొదటి వారానికి రాజ్‌మా పంట దిగుబడి వస్తుంది. అనంతరం గింజలు బాగా ఎండిన తర్వాత డిసెంబర్ రెండవ వారం నుంచి వారపుసంతలు, మండల కేంద్రాల్లో అమ్మకాలు జరుపుతారు. గత ఏడాది ఎరుపు రకం రాజ్‌మా గింజలు కిలో రూ.70 నుంచి రూ.80ల ధరతో వ్యాపారం జరిగింది. సీజన్ ఆఖరులో రూ.90 వరకు అమ్ముడైంది.



బిరిమిశాల ప్రాంతంలో రాజ్‌మా సాగుకు చదును చేస్తున్న గిరిజనులు

రాజ్‌మా విత్తనాల పంపిణీ పూర్తి



ప్రభుత్వ ఆదేశాల మేరకు పాడేరు డివిజన్‌లో ఆర్‌బీకేల ద్వారా రాజ్‌మా విత్తనాల పంపిణీ పూర్తి చేశాం. రాజ్‌మా పంటను ప్రతీ ఏడాది సాగు చేసే రైతులకు విత్తనాలు అందజేశాం. విత్తనాలను దుర్వినియోగం చేయకుండా అవగాహన కల్పించాం. మెట్ట, కొండపోడు భూముల్లో విత్తనాలు నాటారు. కొన్ని చోట్ల మొక్క దశలో పంట ఆశాజనకంగా ఎదగడం సంతోషంగా ఉంది.

– ఎస్.బి.ఎస్.నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

సీఎం మేలు చేశారు



90శాతం సబ్సిడీపై రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో మేలు చేశారు. ప్రతీ ఏడాది ప్రైవేటు మార్కెట్‌లో రూ.120 నుంచి రూ.150 ధరతో రాజ్‌మా విత్తనాలను కొనుగోలు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఈ ఏడాది ప్రభుత్వం సకాలంలో వ్యవసాయశాఖ ద్వారా 90శాతం సబ్సిడీతో విత్తనాలను పంపిణీ చేసింది. తాను కూడా విత్తనాలను పొంది రెండెకరాల్లో రాజ్‌మా పంటను సాగు చేస్తున్నాను.

– కొర్రా కృష్ణమూర్తి, గిరిజన రైతు, తీగలవలస, హుకుంపేట మండలం

లంబసింగికి పర్యాటకుల తాకిడి



చెరువులవేనం కొండల్లో పర్యాటకులు

చింతపల్లి/మారేడుమిల్లి: జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలకు సోమవారం సందర్శకులు పోటెత్తారు. ఆంధ్రా కశ్మీర్ లంబసింగిలో సోమవారం పెద్ద సంఖ్యలో పర్యాటకులు సందడి చేశారు. మంచు అందాలు ఆస్వాదించి, సమీపంలోని చెరువులవేనం కొండల్లో పాల సంద్రాన్ని తలపించే మంచు మేఘాల అందాలు తిలకించారు. తాజంగి రిజర్వాయర్‌కు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. . అక్కడ జిప్‌లైన్ ఎక్కి మంచి అనుభూతికి లోనయ్యారు.మారేడుమిల్లి మండలంలో పర్యాటక ప్రదేశాలు సందర్శకులతో కళకళలాడాయి. జలతరంగిణి, అమృతధార, జంగిల్ స్టార్, పాములేరు, వాలీసుగ్రీవ్ వనమూలికల ప్రదేశం, వ్యూపాయింట్స్, గుడిసె తదితర పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులు సందడి చేశారు. జలపాతాల వద్ద కేరింతలతో జలకాలాడారు.

పండగ వేళ విషాదం



తీవ్రంగా గాయపడిన బుల్లబ్బాయి



ప్రమాదంలో మృతి చెందిన ప్రకాష్, తేజ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

రంపచోడవరం: దసరా పండగ వేళ విషాదం చోటు చేసుంది. గుడికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం రూపంలో ఇద్దరిని మృత్యువు కబళించి, వారి కుటుంబాలను శోక సంద్రంలో ముంచేసింది. మండల కేంద్రానికి సమీపంలోని పెదగెద్దాడ వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం రాత్రి 6.30 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. రంపచోడవరం మండలం అనేంపల్లి గ్రామానికి చెందిన వలల ప్రకాష్(20),ఆయన మేనకోడలు కాటోజీ తేజ(15), వారి బంధువు వలల బుల్లబ్బాయి కలిసి బైక్‌పై మండలంలోని సీతపల్లిలో గల బాపనమ్మ ఆలయానికి వెళ్లారు. దర్శనం అనంతరం తమగ్రామానికి బైక్‌పై వెళుతుండగా మారేడుమిల్లి వైపు నుంచి వస్తున్న వాహనం వీరి బైక్‌ను ఢీ కొంది. దీంతో రోడ్డుపై పడిపోయిన వలల ప్రకాష్, తేజలపై నుంచి వేరే గుర్తుతెలియని వాహనం దూసుకెళ్లడంతో మృతి చెందినట్టు స్థానికులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బుల్లబ్బాయిని రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సీతపల్లిలోని గురుకుల బాలిక పాఠశాలలో తేజ ఎనిమిదో తరగతి చదువుతోంది. ప్రకాష్, బుల్లబ్బాయిలు గ్రామంలో వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టానికి రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్ చేయూతతో ఆర్థిక భరోసా



వైఎస్సార్ చేయూత చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

- ఎమ్మెల్యే ధనలక్ష్మి
- సీఎం చిత్రపటానికి మహిళల క్షీరాభిషేకం

ఎటపాక: వైఎస్సార్ చేయూత పథకంతో మహిళలకు ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే ధనలక్ష్మి తెలిపారు. ఎటపాక మండలం నల్లకుంట ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో సోమవారం ఆమె వైఎస్సార్ చేయూత చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు చెందిన సుమారు నాలుగు వేలమంది మహిళలు పాల్గొన్నారు. ముందుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి, జై జగనన్న అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మూడు విడతల్లో 21,450 మంది మహిళల ఖాతాల్లో నేరుగా రూ.40.21 కోట్లు జమచేశారని చెప్పారు. మహిళల జీవితాల్లో వెలుగు నింపేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాల ఏర్పాటుతో సుపరిపాలన అందుతోందని చెప్పారు. గత పాలకులు డ్వాక్రా అక్క చెల్లెమ్మలను అప్పుల ఊబిలోకి నెట్టేశారని ఆరోపించారు. అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమని చెప్పారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వీర్రాజు, జెడ్పీటీసీలు ఉబ్బా సుష్మిత, చిచ్చడి మురళి,గుజ్జా విజయ,ఎంపీపీలు కాక కామేశ్వరి, సవలం విమల,పాయం రంగమ్మ, నాలుగు మండలాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు,ఎటపాక సొసైటీ చైర్మన్ ఆకుల వెంకట రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తాని కొండ వాసు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన మహిళలు

విశాఖ టు పూణే



- నేటి నుంచి ఇండిగో నాన్‌స్టాప్ సర్వీసు
- వారంలో మూడు రోజులు నడపనున్న ఇండిగో
- క్రమంగా పెరుగుతున్న డిమాండ్

సాక్షి, విశాఖపట్నం : వైజాగ్–పూణేల మధ్య మళ్లీ విమాన సర్వీసు ప్రారంభం కానుంది. ఈ ఏడాది మార్చిలో ఇండిగో సంస్థ రెడ్ ఐ పేరిట తొలిసారిగా ఈ సర్వీసును ప్రవేశపెట్టింది. ప్రయాణికుల స్పందన తక్కువగా ఉండడంతో రెండు నెలల తర్వాత దీనిని రద్దు చేసింది. ప్రస్తుతం విమాన ప్రయాణికుల నుంచి డిమాండ్ కనిపిస్తుండడంతో మంగళవారం నుంచి ఈ సర్వీసును పునరుద్ధరిస్తోంది. వారంలో మూడు రోజులు ఈ విమానాన్ని నడపనుంది. విశాఖలో మంగళ, గురు, శనివారాల్లో వేకువజామున 2.40 గంటలకు బయలుదేరి 5.25 గంటలకు పూణే చేరుకుంటుంది. అలాగే పూణేలో సోమ, బుధ, శుక్రవారాల్లో అర్ధరాత్రి 11.45 గంటలకు బయలుదేరి 1.35 గంటలకు విశాఖలో ల్యాండ్ అవుతుంది.

ఊపందుకున్న రాకపోకలు

వాణిజ్యపరంగా పూణే ఎంతో ప్రాముఖ్యత కలిగిన నగరం. దేశంలో మెట్రో నగరాల తర్వాత టాప్ 10 సిటీల్లో పూణే కూడా ఒకటి. పైగా దేశ ఆర్థిక రాజధాని ముంబైకి శాటిలైట్ నగరం గాను వెలుగొందుతోంది. మరోవైపు విశాఖ నగరం కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. మరోవైపు కోవిడ్ కూడా తగ్గుముఖం పట్టడంతో మునుపటిలా విశాఖపట్నం, పూణేల్లో బిజినెస్ కాన్ఫరెన్స్‌లు, మీటింగులు మళ్లీ మొదలవుతున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల పూణే, విశాఖపట్నంల మధ్య ప్రయాణాలు ఊపందుకుంటున్నాయి.

ఇవన్నీ కలిసొచ్చే అంశాలుగా భావించి ఇండిగో సంస్థ ఈ రెండు నగరాల మధ్య తమ నాన్‌స్టాప్ విమాన సర్వీసును పునఃప్రారంభిస్తున్నట్టుగా తెలుస్తోంది. మంగళవారం నుంచి విశాఖ–పూణేల మధ్య ఇండిగో నాన్‌స్టాప్ సర్వీసు పునరుద్ధరిస్తున్నట్టు విశాఖ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు 'సాక్షి'కి చెప్పారు.

రోజుకు 6–7 వేల మంది

విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుల తాకిడి కొన్ని నెలలుగా స్థిరంగా కొనసాగుతోంది. ప్రస్తుతం రోజుకు ఆరు నుంచి ఏడు వేల మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. కోవిడ్ రెండో దశ అనంతరం గత డిసెంబర్‌లో ప్రయాణికుల సంఖ్య 2.5 లక్షలకు తాకింది. అయితే ఒమిక్రాన్ భయంతో ఫిబ్రవరి, మార్చి నెలల్లో కాస్త తగ్గింది. ఆ తర్వాత మళ్లీ క్రమంగా రెండు లక్షలకు చేరుకుంది. రానున్న రోజుల్లో ఈ ఎయిర్‌పోర్టు నుంచి విమాన ప్రయాణికుల సంఖ్య మరింత పుంజుకుంటూ కోవిడ్ ముందునాటి పరిస్థితికి (నెలకు 2.85 లక్షలకు) రావచ్చని విమానాశ్రయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో మరికొద్ది నెలల్లో విశాఖకు మరిన్ని విమాన సర్వీసులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టు నుంచి రోజుకు 75 సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే కొత్తగా మరో 10 విమానాలను నిర్వహించే అవకాశం ఉంది. ఈ టెర్మినల్ బిల్డింగ్‌లో ఒకేసారి 12 విమానాలు పార్కింగ్ చేసుకునే వీలుంటుంది.

11 నుంచి సీనియర్ వుమెన్ టీ20 క్రికెట్

విశాఖ స్పోర్ట్స్: బీసీసీఐ సీనియర్ వుమెన్ టీ20 టోర్నీ బెంగళూర్ వేదికగా ఈనెల 11 నుంచి ప్రారంభం కానుంది. ఆంధ్ర సీనియర్ మహిళా జట్టు 11న ఒడిశాతో తొలి మ్యాచ్ ఆడనుండగా 22న త్రిపురతో చివరి మ్యాచ్ ఆడనుంది. 12న యూపీ జట్టుతో, 14న మేఘాలయతో, 16న హైదరాబాద్‌తో, 18న మిజోరాంతో, 20న నాగాలాండ్ జట్టుతో తలపడనుంది. ఈ సందర్భంగా క్రికెట్ అడ్వయిజరీ కమిటీ జట్టును ఎంపిక చేసిందని ఏసీఏ సీఈవో ఎం.వి.శివరెడ్డి తెలిపారు. సిఏసి జట్టు కోచ్‌గా సి.మధుసూదన్‌రెడ్డిని నియమించిందన్నారు. సహాయకోచ్‌గా రమాదేవి,ఫీల్డింగ్ కోచ్‌గా యుగంధర్‌రెడ్డి, ఫిజియోగా ధరణి, ట్రైనర్‌గా దినేష్, వీడియో ఎనలిస్ట్‌గా రాజేశ్వర రెడ్డి ,మేనేజర్‌గా వై.వెంకటేష్ సేవలందించనున్నారు.

సీఆర్‌పీఎఫ్ సేవలు



పేదలకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరం వారపు సంతలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో పేదలకు భోజనం అందజేశారు. ఈ సందర్భంగా సుమారు 170 మంది పేదలకు భోజనం, వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

భిన్న కుల, మతాల ఐక్య శక్తి భారత్

ఆర్‌ఎస్‌ఎస్ ఏపీ ప్రాంత కార్యకారిణి సదస్సులో వోలేటి సత్యనారాయణ

రావికమతం : భిన్న మతాలు, కులాల ఐక్య శక్తి మన భారతదేశమని, మనమంతా భరతమాత ముద్దుబిడ్డలమని ఆర్‌ఎస్‌ఎస్ ఏపీ ప్రాంత కార్యకారిణి సదస్సులో వోలేటి సత్యనారాయణ అన్నారు. స్థానిక హైస్కూల్లో సంఘ సమారూప్ కార్యక్రమం వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. శక్తి అనేది ఎప్పుడూ ఒక వ్యక్తి నుంచే ప్రారంభం అవుతుందన్నారు. సంఘ కూడా ఒక వ్యక్తితో ప్రారంభమై నేడు దేశంలోనే మహాశక్తిగా ఎదిగిందన్నారు. ప్రతి వ్యక్తి దేశభక్తి కలిగి ఉండాలని, స్వయం సేవక్‌లు కరడుకట్టిన దేశభక్తులుగా ఉండాలని అన్నారు. సంఘం 2025కి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా గ్రామ గ్రామంలో విస్తరింపచేసి సంఘ శాఖలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘసేవక్ రాపర్తి సత్యనారాయణ, వర్గకావ్యవాహ బండారు శ్రీరామ్మూర్తి పలువురు పాల్గొన్నారు. అంతకు ముందు రావికమతం ప్రధాన వీధుల్లో వందలాది మంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు సోమవారం భారీ కవాతు నిర్వహించారు.



రావికమతంలో కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

కోలుకుంటున్న భవానీ భక్తులు

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పరామర్శ

పాయకరావుపేట : గోపాలపట్నం గ్రామంలో దుర్గాలమ్మపూజ అనంతరం అల్పాహారం తీసుకొని అస్వస్థతకు గురై తుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భవానీ భక్తులను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వీరజ్యోతి పరామర్శించారు. తుని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భవానీ భక్తులను పలకరించి, వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. గోపాలపట్నం గ్రామం వెళ్ళి గ్రామంలో కొందరు భవానీ భక్తులను కూడా అస్వస్థతకు గురైన వారిని పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీసారు. వైద్యులు సలహా తీసుకోవలసిందిగా కోరారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఆమెతో పాటు మంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ మురళీకృష్ణారెడ్డి, డాక్టర్ అనూష, తహసీల్దార్ కె.జయప్రకాష్, సర్పంచ్ పన్నీరు బాబ్జి పాల్గొన్నారు.



వైద్యం పొందుతున్న భవానీ భక్తులను పలకరిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వీరజ్యోతి

వినూత్న బోధనకు సముచిత గౌరవం



అవార్డు అందుకుంటున్న విజయభాను కోటే

పాయకరావుపేట: కేహెచ్‌వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని విజయభాను కోటే ఐడియల్ టీచింగ్ అవార్డు అందుకున్నారు. ఆమె అమలు చేస్తున్న హ్యూటాగాజీ విద్యా విధానానికి గుర్తింపుగా ట్యూటర్స్ ప్రైడ్ సంస్థ, రాజారత్న కిట్స్ ఇంజినీరింగ్ కాలేజ్ సంయుక్తంగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశాయి. రామచంద్రపురంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఆర్.బి.అంకం ఆధ్వర్యంలో ఇన్నోవేటివ్ ఎడ్యుకేషన్ ఎక్స్‌పర్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఐటీఏపీ జ్యూరీ కమిటీ చైర్మన్ బి.ఎస్.రాములు, ప్రముఖ రచయిత పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ అందజేశారు.

తైక్వాండోలో పతకాల పంట



పతకాలు సాధించిన వారితో కోచ్ చందు

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు తైక్వాండో విద్యార్థులు మరోమారు పతకాల పంట పండించారు. ఇటీవల జిల్లా స్థాయిలోనూ ఇప్పుడు రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటారు. అడ్డురోడ్డు తైక్వాండో క్లబ్ నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న 14 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో మెడల్స్ సాధించినట్టు కోచ్ చందు తెలిపారు. నెల్లూరులో గత నెల 29 నుంచి ఈ నెల 2 వరకు నిర్వహించిన ఏపీ కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అడ్డురోడ్డు క్లబ్ నుంచి 16 మంది పాల్గొన్నారు. అందులో 14 మంది పతకాలు సాధించారు. ఇద్దరు స్వర్ణపతకాలు, ముగ్గురు రజత పతకాలు, 9 మంది కాంస్య పతకాలు సాధించారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులకు న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ఉత్తరాంధ్ర చెస్ విజేత వెంకట రిత్విక్



రిత్విక్‌కు ప్రథమ బహుమతి అందజేస్తున్న స్టీల్ ప్లాంట్ జనరల్ మేనేజర్ పి.సురేష్

అనకాపల్లి టౌన్: చెస్ పోటీల ద్వారా జ్ఞాపకశక్తి పెంచుకోవచ్చని విశాఖ స్టీల్ ప్లాంట్ జనరల్ మేనేజర్ పి.సురేష్ అన్నారు. గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో మూడు రోజులుగా నిర్వహించిన ఉత్తరాంధ్ర(పి.జె.చెస్ పోటీలు) చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. శరీర దృఢత్వాన్ని కలిగి ఉండాలని, ఆటలపై శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విశాఖకు చెందిన వెంకట రుత్విక్, అనకాపల్లికి చెందిన సాకేత్, కార్తిక్‌లకు జీఎం సురేష్, వాసు, జయలక్ష్మి బహుమతులు ప్రదానం చేశారు. వాసు, సురేష్, నాయుడు, గణేష్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర క్రికెట్ పోటీల విజేత గాజువాక

అచ్యుతాపురం(అనకాపల్లి): ఉత్తరాంధ్ర స్థాయి క్రికెట్ పోటీల విజేతగా గాజువాక జట్టు నిలిచింది. అనకాపల్లి, హరిపాలెం జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. హరిపాలెం పరిధి కొండకర్లలో గ్రామ యువత ఆధ్వర్యంలో 40 రోజులుగా ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ బహుమతులు అందజేశారు. ఎంపీపీ సంధ్యాబుజ్జి, వైఎస్సార్‌సీపీ నేతలు సూర్యనారాయణ, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.





క్లుప్తంగా

వాలీబాల్ కిట్లు పంపిణీ



కంద్రుంలో క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న నాయకుడు నర్సింగ్

డుంబ్రిగుడ: యువత క్రీడా రంగంలో రాణించాలని కోరుతూ అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నర్సింగ్ ఆర్థిక సహాయంతో దసరా పండుగ సందర్భంగా కంద్రుం పంచాయతీలో క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు సోమవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు రాణించాలని, ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గజపతి మృతికి సంతాపం

జి.మాడుగుల: బొయితిలి పంచాయతీ వైస్ సర్పంచ్ తమర్బ గజపతిరాజు సోమవారం ఉదయం విశాఖపట్నం కెజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. గజపతి గత కొన్ని రోజులుగా అనారోగ్యం కారణంగా కెజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు కుటుంబీకులు చెప్పారు. గజపతి మృతికి మాజీ మంత్రి బాలరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ వెంకటగంగరాజు, ఎంపీటీసీ సభ్యులు విజయకుమారి, సన్యాసిదొర, వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు తదితరులు సంతాపం తెలిపారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



గ్రామ శివారులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వై.రామవరం: మండల కేంద్రంలోని ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన రికార్డులు పరిశీలించి, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారిపై కేసులు నమోదు చేశారు. తనిఖీలలో సీఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ సిబ్బంది, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అలగాంలో వైద్య శిబిరం

జి.మాడుగుల: మండలంలో ఉవ్వాసింగి పంచాయతీ అలగాం గ్రామంలో మంగళవారం స్థానిక పోలీసు వారి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ విశాఖపట్నం గాయత్రి విద్యా పరిషత్ ఆస్పత్రికి చెందిన వైద్యులతో పాటు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ల ద్వారా గిరిజనులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేయనున్నట్టు చెప్పారు. పరిసర గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం

పాడేరు రూరల్ : లగిసపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని కాడెలి, వర్తనాపల్లి గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చేపడుతున్నట్టు సర్పంచ్ బసవన్న దొర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి హాజరవుతారని, పార్టీ శ్రేణులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు హాజరుకావాలని పేర్కొన్నారు.

దేవీపట్నం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి దేవీపట్నం మండలంలో మంగళవారం పర్యటించనున్నట్టు పార్టీ వర్గీయులు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఇందుకూరుపేట గ్రామ సచివాలయ పరిధిలో ఇందుకూరుపేట, పోతుకొండ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేతల మృతికి సంతాపం

పాడేరు రూరల్ : సీపీఎం కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు, కేరళ రాష్ట్ర మాజీ కార్యదర్శి బాలకృష్ణన్, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ వ్యవస్థాపకుడు కుమార్ సిరాల్కర్ మృతి పట్ల పాడేరులో ఆయా పార్టీ, సంఘ నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నయ్య పడాల్, ఉమామహేశ్వరావు, సుందర్‌రావు, హైమవ్తి, బాల్‌దేవ్, నర్సయ్య, బొజ్జన్న, నాయుడు తదితరులున్నారు.

బస్సు సర్వీసు కోసం వినతి

గంగవరం : మోహనాపురం ప్రాంతానికి ఆర్టీసీ బస్సు సర్వీసు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. బస్సు సర్వీసును నడపడం ద్వారా మోహనాపురం పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరం ఉంటుందని చెబుతున్నారు. రంపచోడవరం- అడ్డతీగల మధ్య వయా మోహనాపురం మీదుగా బస్సు సర్వీసు వల్ల రంపచోడవరం, వై.రామవరం మండలాలకు చెందిన చాలా గ్రామాల ప్రజలకు సౌకర్యం ఉంటుందని అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మోహనాపురం వరకు బస్సు సర్వీసు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి



గురుపల్లిలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి,పాడేరు: మండలంలోని కాడెలి పంచాయతీ గురుపల్లిలో మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి మూడేళ్లు అవుతున్న సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు రెండు రోజుల నుంచి సంబరాలు జరుపుకొంటున్నారు. ఈ సందర్భంగా గురుపల్లి గ్రామాన్ని సోమవారం సందర్శించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి సర్పంచ్ బసవన్నదొర, ఉప సర్పంచ్ పసుపుల గుల్లిశ్వరి ఆధ్వర్యంలో గిరిజన మహిళలు,సచివాలయ ఉద్యోగులు,వలంటీర్లు ఘన స్వాగతం పలికారు.అనంతరం మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వీఆర్వో కిల్లు పద్మకుమారి, నాయకులు కిండంగి, పసువుల సత్యనారాయణ, మినుముల కన్నా పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రయాణం



ఆంధ్రా నుంచి ఒడిశా గ్రామాలకు కిక్కిరిసిన ప్రయాణికులతో వెళ్తున్న ఆటో

హుకుంపేట: ఆంధ్రా–ఒడిశా గ్రామాలకు రవాణ సౌకార్యం సక్రమంగా లేకపోవడంతో గిరిజనులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. బస్ సౌకార్యం లేకపోవడం వలన ఆటోలపై కప్పుపై ఎక్కి ప్రయాణిస్తున్నారు. హుకుంపేట మండల కేంద్రం నుంచి కామయ్యపేట మీదుగా ఒడిశా గ్రామాలైన సూడుబు, ఓంద్రుగెడ్డా, సొబాపుట్టు, తాంకేలు, సర్యపల్లి, ఆటుగుడ, బైలుగూడ, పాడువ గ్రామాలతో పాటు పలు గ్రామాలకు ఏకైక రహదారి. ఆయా గ్రామ ప్రజలు పండించిన కూరగాయలు, అటవీ ఉత్పత్తులు, తదితర సరకులు సంతల్లో విక్రయించుకునేందుకు , నిత్యావసర సరకులు కొనుగోలు చేసుకునేందుకు ఈ మార్గం మీదుగానే రాకపోకలు సాగాల్సి వస్తోంది. ఈ మార్గంలో ఇరు రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ఆయా ప్రాంతవాసులు నిత్యం ప్రైవేట్ వాహనాల్లో ప్రయణాలు సాగిస్తున్నారు. అయితే ఆయా మార్గం అరకొరగా ప్రైవేట్ వాహనాలు వస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. వాహనాల టాప్ పైకి ఎక్కి గ్రామాలకు వెళ్తున్నారు. వాహనం ఏ మాత్రం అదుపుతప్పినా పెద్ద ప్రమాదం జరుగుతుంది. గత్యంతరం గ్రామస్తులు ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నార. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకర ప్రయాణాలు నివారించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గిరిజనుల అభ్యున్నతే ధ్యేయం



గురుపల్లిలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. పాడేరు మండలంలోని లగిశపల్లి పంచాయతీ ఎర్రగుప్ప, కాడెలి పంచాయతీ గురుపల్లి, తోటగున్నలు, చావిడిమామిడి, మల్లుగరువు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని 188 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న నవరత్నాల పథకాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలు, వైఎస్సార్ పింఛన్ కానుకలతో తాము ఎంతో లబ్ధిపొందుతున్నామని, ఎప్పుడు ఎన్నికలు వచ్చిన వైఎస్సార్‌సీపీకే ఓటు వేస్తామని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్నే మరలా కోరుకుంటున్నామని వారంతా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా పథకాలు అమలవుతున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుబాటులో వచ్చాయన్నారు. అన్ని గ్రామాల్లో అత్యవసర పనులకు ప్రభుత్వం ప్రతి సచివాలయ పరిధిలో రూ.20లక్షలు మంజూరు చేసిందన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీపీ రత్నకుమారి. జిల్లా వ్యవసాయ మండలి అధ్యక్షురాలు సరస్వతి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బసవన్నదొర, సర్పంచ్‌లు సీదరి రాంబాబు,వంతాల రాంబాబు, నీలకంఠంనాయుడు, ఉప సర్పంచ్ గుల్లిశ్వరి, ఎంపీటీసీ సభ్యులు రామకృష్ణ పాత్రుడు, నరసింహమూర్తి, సన్యాసిరావు, బొంజుబాబు, చిట్టమ్మ, మాజీ ఎంపీపీ రమణమూర్తి, నాయకులు సూరిబాబు, దశమూర్తి, కన్నా పాత్రుడు, సుదర్శన్, సుశీల, భారతి తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా ముల్లంగి సాగు



ముల్లంగిని శుభ్రం చేస్తున్న రైతులు

డుంబ్రిగుడ: మండలంలోని మారుమూల పంచాయతీ కొర్రాయి, కోల్లాపుట్టు, పంచాయతీల్లో గిరిజన రైతులు ముల్లంగి పంటలను విస్తారంగా పండిస్తున్నారు. వాతావరణం అనుకూలించడంతో కూరగాయలు, ఆకుకూరల పంటలు విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం చాలా పంటలు దిగుబడులు రాగా, కొన్ని పంటలు చేతికందే పరిస్థితుల్లో ఉన్నాయి. వారపు సంతల్లో విక్రయించేందుకు ఆదివారం గత్తరజిల్లెడ గ్రామ సమీపంలో ఉన్న గెడ్డలో పెద్ద ఎత్తున ముల్లంగి కూరలను శుభ్రం చేస్తున్నారు. ఈ ముల్లంగి కూరలను ఆయా వారపు సంతల్లో,విశాఖ పట్నం రైతు బజార్‌లో విక్రయిస్తారు. గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

లంపీ చర్మ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు



వైద్యాధికారి గణేశ్వరరావు



రోగులపేట గ్రామంలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

అనంతగిరి: లంపీ వ్యాధి దృష్ట్యా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తం చేశామని, పశువైద్యాధికారి గణేశ్వరరావు అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో లంపీ స్కిన్ వ్యాధిపై ఇప్పటికే అప్రమత్తమైయ్యామని, వ్యాధి లక్షణాలు ఉంటే గ్రామాల్లో వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నామని, గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మెంటాడ, చిలకలగెడ్డ, దేవరాపల్లి చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తం చేశామని, పశువుల తరలింపుపై చర్యలు చేపడుతున్నామన్నారు. కాశీపట్నం వారపు సంతలోని పశువులు విక్రయాలపై నిషేదించామన్నారు.

పెదబయలు: లంపీ స్కిన్ వ్యాధి ప్రబలకుండా ముందస్తుగా పశువులకు టీకాలు వేసినట్టు లైవ్ స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మి తెలిపారు. సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామంలో 98 పశువులకు లంపీ స్కిన్ నివారణ టీకాలు, 32 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు అందజేసినట్టు చెప్పారు. పశువులకు వ్యాధులు ప్రబలితే వెంటనే ఆయా గ్రామ సచివాలయం పరిధిలో వెటర్నరీ అసిస్టెంట్‌కు సమాచారం అందించాలని కోరారు.

కొయ్యూరు: లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు వేస్తున్నామని పశువైద్యాధికారి కె.రాజేష్‌కుమార్ తెలిపారు. మండలానికి మొదటి విడతగా మూడు వేల టీకాలు వచ్చాయన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలో సరిహద్దుగా ఉన్న ఆడాకుల, బి.కొత్తూరు ప్రాంతాల్లో ముందుగా పశువులకు వ్యాక్సినేషన్ చేపట్టామన్నారు. మండలంలో ఎక్కడా వ్యాధి నమోదు కాలేదని తెలిపారు. వ్యాధి సోకిన పశువులకు జ్వరం తీవ్రంగా ఉండి చర్మంపై విపరీతంగా దద్దుర్లు వస్తాయని చెప్పారు. దీనిపై రైతులను అప్రమత్తం చేశామన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకుడు రామారావు

వై.రామవరం: అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సహచర కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా నాయకుడు లోత రామారావు పిలుపునిచ్చారు. వై.రామవరంలో సోమవారం సీఐటీయూ మండల ఇన్‌చార్జి శాంతిరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో నాయకులు రామారావు, వాణిశ్రీ, రామరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ, మిడ్డే మీల్స్ కార్మికులు, వెలుగు యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేఖ విధానాలపై ఐక్యంగా పోరాడదామని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన మండల కమిటీ ఎన్నికలో అధ్యక్షురాలిగా బేబీరాణి, కార్యదర్శిగా శాంతిరాజు, ఉపాధ్యక్షురాలిగా మంగమ్మ, సహాయ కార్యదర్శిగా వరుణ్, ఆఫీస్ బేరర్స్‌గా శైలజ, తులసీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీఐటీయూ, గిరిజన సంఘం, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు



గిరిజనులకు ఆర్‌వోఆఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మిల్కి, వైస్ ఎంపీపీ భాగ్యవతి



గ్రామ సభలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ శ్రీనివాస్

ముంచంగిపుట్టు: గ్రామసభల నిర్వహణతో గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించవచ్చని వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి అన్నారు. వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలోని సచివాలయం వద్ద సర్పంచ్ మిల్కి ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభను నిర్వహించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై శాఖల వారీగా చర్చించారు. పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పలు తీర్మాణాలు చేశారు. ఈ సందర్భంగా 132 మంది గిరిజనులకు ఆర్‌వోఆఫ్‌ఆర్ పట్టాలను సర్పంచ్ మిల్కి, వైస్ ఎంపీపీ భాగ్యవతి అందజేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామాలకు అవసరమైన పనులు చేపడుతున్నామన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఉప సర్పంచ్ సీతారాం, నేతలు, పలు శాఖల అధికారులు, వలెంటీర్లు, అధిక సంఖ్యల్లో ప్రజలు పాల్గొన్నారు.

చింతపల్లి: పంచాయతీలకు సంబంధించి 2023–24 వార్షిక బడ్జెట్ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈవోపీఆర్డీ శ్రీనివాస్ అన్నారు. పారిశుద్ధ్య ప్రణాళికలు, నవరత్నాలు అమలు, ప్లాస్టిక్ నిషేదం, పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన వివరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు ఎంతగానో ఉపయోగపడతాయని సర్పంచ్ వెంకటపూర్ణిమ్మ అన్నారు. పంచాయతీ కేంద్రంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. పారిశుద్ధ్యం , తాగునీరు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. వైస్ ఎంపీపీ ప్రియాంక, మహేశ్వరరావు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



ఆదివాసీల ఆత్మీయ కలయికలో ర్యాలీలో పాల్గొన్న సీతారామన్నదొర

కూనవరం: ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలని గిరిజన సేవక్ సంఘ్ జాతీయ కన్వీనర్ కారం సీతారామన్నదొర(డిల్లీబాబు) అన్నారు. కొండరెడ్ల కుగ్రామం టేకులొద్దిలో జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆదివాసీల ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీల ఆచార సంప్రదాయాలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఆదివాసీ నివాస గ్రామాల్లో విద్య, వైద్యం, రవాణా, రహదారుల సమస్యలతో ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టేకులొద్ది గ్రామంలో కల్వర్టు నిర్మించి, రోడ్డు మరమ్మతు చేపట్టాలని కోరారు. అనంతరం కొండరెడ్ల యువకులకు టీషర్ట్‌లు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వలంటీర్ లక్ష్మారెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధనలక్ష్మి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఎటపాక : రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి లక్ష్మణరావు తండ్రి రత్తయ్య వర్ధంతిలో కార్యక్రమంలో పాల్గొన్నారు. గన్నవరంలో రత్తయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన కుటుంబానికి ప్రగాడ సానుభూతిని తెలిపారు. అనంతరం తోటపల్లిలో పార్టీ నాయకుడు కడియాల శేషగిరి తండ్రి పెదపుల్లయ్య ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే ధనలక్ష్మి కలిసి పరామర్శించారు.

50 మందికి వైద్య పరీక్షలు



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ నాగార్జున, సిబ్బంది.

రాజవొమ్మంగి: అమ్మిరేఖల గ్రామంలో 104 ద్వారా సుమారు 50 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ నాగార్జున, డీఈఓ శ్రీనివాస్, పైలెట్ శివ కనక రాజు, ఆశ సత్యవతి పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాష్టమి వేడుకలు



పాడేరులోని ఉమా నీలకంఠేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

- దుర్గాదేవికి ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్తులు

పాడేరు రూరల్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం దుర్గాష్టమి వేడుకలను పాడేరులో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మోదకొండమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

జి.మాడుగల: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన మండపంలో కనకదుర్గమ్మను మాజీ మంత్రి బాలరాజు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ వెంకటలక్ష్మి భక్తులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. నాయకుడు వెంకటగంగరాజు, భక్తులు పాల్గొన్నారు.



జి.మాడుగులలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి బాలరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ వెంకటలక్ష్మి



ప్రత్యేకాలంకరణలో భువనేశ్వరి అమ్మవారు

డుంబ్రిగుడ: అరకు సంతబయలు గ్రామంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండపం ఏర్పాటుచేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

చింతపల్లి: చింతపల్లి, లోతుగెడ్డ జంక్షన్, తాజంగి గ్రామాల్లో ఆలయాల్లో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొయ్యూరు: రాజేంద్రపాలెంలో కనకదుర్గమ్మ తల్లి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. భారీ వర్షంలో భక్తులు పాల్గొని అమ్మవారికి సారె, నైవేద్యాలను సమర్పించారు.



రాజేంద్రపాలెంలోని అమ్మవారి సారె ఊరేగింపులో భక్తులు



చింతపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



అరకు సంతబయలులో దసరా వేడుకలు

గంగవరం: స్థానిక రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంతో పాటు ఏటిపల్లి, నెల్లిపూడి గ్రామాల్లో దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో శ్రీ అమరవల్లభేశ్వరుని ఆలయంలో వేంచేసిన భువనేశ్వరి అమ్మవారికి దుర్గాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి శాఖాన్నం నివేదన గావించారు. నిరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిపారు.

ప్రజా సంక్షేమం కోసం పాదయాత్ర



శాంతకుమారి

అరకులోయ రూరల్: ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ భారత్ జోడో పాదయాత్ర చేస్తున్నట్టు అరకు నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి పాచిపెంట శాంతకుమారి అన్నారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పార్టీ ధ్యేయమన్నారు. రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో పాదయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందన్నారు. పార్టీ శ్రేణులు సమష్టిగా పని చేయాలన్నారు.